




ఆరోగ్య శాఖలో..
ప్రతి పనికో రేటు..!

- చేయి తడిపితేనే పని
- లేకుంటే ఫైలు ముందుకు కదలదు...



కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న ఓ ప్రయివేట్ ఆస్పత్రి, ఎన్ఆర్ పేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి రెన్యువల్ చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు కొన్ని నెలలుగా తిప్పకుంటున్నారు. ఆయా ఆస్పతుల్లో కొన్ని లోపాలను అడ్డుగా పెట్టుకుని రెన్యువల్ చేయడానికి తీవ్ర జాప్యం చేస్తున్నారని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తాము ఉన్న లోపాలను సరిచేసుకున్నా రెన్యువల్ చేయడం లేదని వాపోతున్నారు. ఇలా ఆరోగ్య శాఖలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. చేయి తడిపితేనే ఫైలు ముందుకు కదులుతోంది. లేకుంటే పనులు జరగడం లేదు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైద్య, ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు పట్టుకుంది. ఫైలు ముందుకు కదలాలంటే చేయి తడపాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కొత్తగా 12 పిహెచ్‌సిలు, 400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో పనిచేసే వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల జీతభత్యాలన్నీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచే నడుస్తాయి. ఆయా ఉద్యోగుల జీతభత్యాలు, పెండింగ్ జీతాలు, ఆడిట్లు, సర్వీసు వివరాల నమోదు తదితర ఎస్టాబ్లిష్‌మెంట్ సేవలకు ఈ కార్యాలయానికి వచ్చి పని చేయించుకుని వెళ్లాలి. పని త్వరగా కావాలంటే ఉద్యోగులు చెప్పినంత ముట్ట చెప్పుకోవాలి. లేదంటే ఏదో ఒక కొర్రి పెట్టి కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిప్పుకుంటూనే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. కారుణ్య నియామకాల విషయంలో సదరు కుటుంబ సభ్యులు పనికాక కాళ్లరిగేలా ఈ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంటారు. కొందరికి మాత్రం ఒకటి, రెండు నెలల్లోనే ఆర్డర్ చేతికి వచ్చి ఉద్యోగంలో చేరి ఉంటారు. ఈ అంతరం మధ్య భారీగా మామూళ్లు చేతులు మారుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లినా తిరిగి సర్దుబాటు, డిప్యూటేషన్ పేరుతో ఇదే కార్యాలయంలో పనులు చేస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు పిహెచ్‌సిలు, అర్బన్ హెల్త్ సెంటర్ల తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడి అసౌకర్యాలు, రోగులకు వైద్యం చేయకపోవడం, వైద్యులు, ఉద్యోగుల గైర్హాజరు, సమస్యలు ఏవీ బయటకు రాకుండా మామూళ్లతో మాయ చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగానే ఇటీవల అధికారులు తరచూ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రిజిస్ట్రేషన్, రెన్యువళ్లకు ఇచ్చుకోవాల్సిందే..

వైద్య, ఆరోగ్య శాఖలో ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్‌కు చాలా డిమాండ్. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ గతంలో డెమో సెక్షన్ చూసేది. రెండేళ్లుగా ఓ ఉద్యోగికి ఆ బాధ్యతలు బదలాయించారు. స్కానింగ్ సెంటర్ల అనుమతులు మాత్రం డెమో సెక్షన్‌లోని ఉద్యోగులు నిర్వర్తిస్తున్నారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌లో భాగంగా తాత్కాలిక, పర్మినెంట్, రెన్యువళ్లు, స్కానింగ్ సెంటర్ల అనుమతులకు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పలు సందర్భాల్లో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలూ లేవు. కార్యాలయం చుట్టూ తిరగలేమని. ప్రతి పనికీ ఒక రేటు ఫిక్స్ చేసుకుందామని పలు ప్రయివేట్ ఆస్పత్రులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రయివేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల విషయంలో ఎలాంటి తనిఖీలూ చేయడం లేదని సమాచారం. మరోవైపు రోగుల నుంచి ఆయా ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు భారీ ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో అబార్షన్లు, భ్రూణహత్యలు జరుగుతున్నా, స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ జరుగుతున్నా పదేళ్లకు పైగా ఒక్క కేసు కూడా నమోదు చేయని పరిస్థితి నెలకొంది. ఆయా ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులు, ఉద్యోగులు అటువైపు చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల డిఆర్‌ఒ వద్ద జరిగిన ఎఫ్ఎన్‌ఒ విచారణతో వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగే అవినీతి గురించి మరోసారి చర్చకు వచ్చింది. సదరు ఎఫ్ఎన్‌ఒకు పదోన్నతి కావాలంటే నగదు లేదా నెక్లెస్ ఇవ్వాలని అడిగారని ఏకంగా ఆమె డిఆర్‌ఒకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి కొందరు ఉద్యోగులు ఇక్కడే పాతుకుపోయి ఉండడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి. వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన ఉద్యోగి ఒకరు ఇటీవల కర్నూలు నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేరారు. వైద్యం చేయించుకుని ఫీజులో మినహాయింపు ఇవ్వాలని సదరు ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరగా 'మీ ఆఫీసు వారు మా ఆస్పత్రికి అనుమతులు ఊరికే ఇస్తున్నారా...మీకు ఫీజులో మినహాయింపు ఇవ్వడానికి' అని మొహం మీదనే కొట్టినట్లు చెప్పడంతో ఏమీ అనలేక సదరు ఉద్యోగి వచ్చేశాడు.

నిర్ణీత రుసుం చెల్లించాలి

ప్రయివేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు అనుమతుల కోసం, రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకు నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అధికంగా ఎవరూ చెల్లించాల్సిన అవసరం లేదు. కొన్ని ప్రయివేట్ ఆస్పత్రులకు అగ్నిమాపక శాఖ అనుమతులు లేవు. అవి తీసుకోవాలని చెబుతున్నాం. అలా అన్ని అనుమతులు లేని దరఖాస్తులను మాత్రమే పెండింగ్‌లో పెడతాం.

- డాక్టర్ ఎల్.భాస్కర్, డిఎంహెచ్‌ఒ.

టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

- ఆర్‌డిఒ భరత్ నాయక్
- ప్రజాశక్తి వార్తకు స్పందన


పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

టమోటా రైతులు నష్టపోకుండా టమోటా కు గిట్టుబాటు ధర కల్పిస్తామని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో టమోటా ధర పతనం అనే వార్త ప్రచురించింది. మంగళవారం ప్రభుత్వ అధికార యంత్రాంగం కదిలి పత్తికొండ వ్యవసాయ మార్కెట్ లో పత్తికొండ ఆర్‌డిఒ మార్కెట్ అధికారులు టమోటా వేలం పాటలోని పాల్గొని టమోటాకి గిట్టుబాటు ధర కల్పించాలని వ్యాపారస్తులకు తెలిపారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ రైతులను కలిసి టమోటా పంట సాగు, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మార్కెట్ సెక్రటరీ కార్నోలిస్ మాట్లాడుతూ మార్కెట్ కు 400 క్వింటాలు, 100 కిలోలకు గరిష్ఠ ధర రూ.2200, మధ్యధర రూ.1800, కనిష్ఠ ధర రూ.1200 కొనుగోలు చేసినట్లు తెలిపారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, ఎడిఎం నారాయణమూర్తి, జిల్లా అగ్రికల్చర్ అధికారి రామాంజనేయులు పత్తికొండ అగ్రికల్చర్ దస్తగిరి పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారాలు అందజేసిన కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం క్యాంపెయిన్‌లో భాగంగా ఉత్తమ మరుగుదొడ్లు నిర్వహించిన వారికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పురస్కారాలు అందజేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 'హమారా శౌచాలయ్-హమారా సమ్మాన్' కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు పరిశుభ్రంగా నిర్వహించిన వారికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 19 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లా అంతటా 'హమారా సౌచాలయ-హమారా సమ్మాన్' పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారన్నారు. గ్రామ, మండలస్థాయి, జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి, ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లు గల వారిని జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 10 మందికి ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. అనంతరం గూడూరు మండలం జూలేకల్ గ్రామానికి చెందిన జె.వెంకటమ్మ, కర్నూలు మండలం గార్గేయపురం గ్రామానికి చెందిన రెడ్డిపోగు సోమన్న, వెల్దుర్తి మండలం బోగోలు గ్రామానికి చెందిన ఇ.లక్ష్మీదేవి, వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన పార్వతమ్మ, కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ పర్వీన్, కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన కె.భక్షుబీ, గోనెగండ్ల మండలం గంజేహల్లి గ్రామానికి చెందిన సి.మహేశ్వరి, తుగ్గలి మండలం తుగ్గలి గ్రామానికి చెందిన ఎస్‌సి రత్నమయ్య, కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన ఎం.రత్నాకర్, గోనెగండ్ల మండలం కర్నూర్ గ్రామానికి చెందిన బి.కృష్ణవేణి (సర్పంచ్)లకు ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ నాగేశ్వరరావు, డిపిఒ గుర్రాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం పట్ల అప్రమత్తంగా ఉండాలి

అల్పపీడనం పట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ నెల 11,12 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08518 277305 ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. వరి, పొగాకు పంటలు సాగు చేసిన రైతులు పంటకోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

కర్నూలు అభివృద్ధి కోసం పోరాటం

- కర్నూలు నుంచి గొందిపర్లకు వంతెన నిర్మించాలి
- రైల్వే వ్యాగన్ వర్క్ షాప్‌ను వేగంగా పూర్తి చేయాలి
- ఉల్చాలలో ఎత్తిపోతల పథకం అవసరం
- సిపిఎం మండల మహాసభలో జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండల అభివృద్ధి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ సూచించారు. సిపిఎం కర్నూలు మండలం మూడవ మహాసభ గొందిపర్ల వసంతనగర్‌లో మండల నాయకులు భీసన్న, బాలపీర అధ్యక్షతన నిర్వహించారు. ప్రారంభ సూచికగా మండలం సీనియర్ నాయకులు ఆంజనేయులు జెండావిష్కరణ చేశారు. ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిన ప్రజాఉద్యమకారులు ప్రముఖులకు మండల నాయకులు రాఘవేంద్ర సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభ నివాళు లర్పించింది. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు రైల్వేవ్యాగన్ ఏర్పాటుపట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నిర్మాణ పనులు ప్రారంభించి 10 ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా రైల్వే వేగం వర్క్ షాప్ పరిస్థితి ఉందన్నారు. వెంటనే పూర్తి చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గొందిపర్ల నుండి కర్నూలు నగరానికి తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ ఉన్నప్పుడు బ్రిడ్జి నిర్మాణం కోసం తీర్మానం చేసి నిధులు కేటాయించారని అన్నారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలకు దీని నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేక నిధులు వెనక్కి వెళ్లాయని అన్నారు. తద్వారా ప్రజలు సామాన్యులు 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తుందన్నారు. బ్రిడ్జి నిర్మిస్తే ఒక కిలోమీటర్ ప్రయాణం నగరంలోకి సులభతరం వెళ్తారన్నారు. ఉల్చాల గ్రామానికి ఎత్తిపోతల పథకం ఏర్పాటుచేసి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీటితోపాటు అధిక ధరలు, విద్యుత్ చార్జీల పెంపు, ఇతరత్రా సమస్యలకు వ్యతిరేకంగా, వాటి పరిష్కారం కోసం మండల అభివృద్ధి కోసం కర్నూలు మండల ప్రజానీకం పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ, మండల కార్యదర్శి పిబి హుస్సేనయ్య ఈ తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టారు. మహాసభలో మండల నాయకులు రాఘవేంద్ర శ్రీరాములు, నాగేష్, నరసింహ, వెంకటేశ్వర్లు, మత్యుంజయుడు ఆయా గ్రామాల నుండి ప్రతినిధులుగా పాల్గొన్నారు.


నూతన కార్యదర్శి పిబి హుస్సేనయ్య


విద్యార్థినులపై దాడులను అరికట్టాలని కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాలు, విద్యార్థుల నిరసన

విద్యార్థినుల పైదాడులను అరికట్టాలి

ఐద్వా, శ్రామిక మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ , డివైఎఫ్ఐ నిరసన


ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయిఉదయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందికొట్కూరులో ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిపై పెట్రోల్ పోసి హత్య చేసిన నిందితుడిని విచారించి చట్ట పరంగా శిక్షించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కర్నూలు కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయిఉదయ్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో పి.నిర్మల, ఎన్.అలివేలు, డివైఎఫ్‌నగర కార్యదర్శి హుస్సేన్ బాష మాట్లాడారు. దేశంలో విద్యార్థులకు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. మొన్న ముచ్చుమర్రి ఘటన నిన్న చాగలమర్రి సంఘటన మరవక ముందే నందికొట్కూరులో విద్యార్థిని ఇంట్లో వెళ్లి అతిక్రూరంగా పెట్రోల్ పోసి విద్యార్థిని దహనం చేయడం చాలా బాధాకరమన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు బాలికలను పాఠశాల కళాశాలలు పంపించాలంటేనే భయాందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వం నిందితులను ఫోక్స్ చట్టం , సిట్టింగ్ జడ్జితో విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళారక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థిని కుటుంబానికి నష్ట పరిహారం కింద రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి బాలిక మహిళ కళాశాల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూ సిటీ , ఓల్డ్ సిటీ నగర కార్యదర్శిలు రాముడు , రాజశేఖర్, ఐద్వా నాయకులు కెఎస్.పద్మ, పద్మ, జయమ్మ, పుష్ప , నోమేశ్వరి, కుమారి , పర్వీన్, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు ఆర్యన్, యువరాజ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

గామీణ విత్తన ఉత్పత్తి పథకంపై అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ముడుమాల, కొండాపురం గ్రామాల్లో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంపై ఎఒ మల్లేష్ కుమార్ మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. వంగడాలని తయారు చేసుకొని పంటలను సాగుచేసుకొని విత్తన కొరత రాకుండా చేసుకోవడం ఈ పథకం ముఖ్య లక్ష్యమని అన్నారు. భూసార పరీక్ష పత్రాలు అందజేసి మొక్కజొన్న పంటల సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హిమబిందు, విహెచ్ఎ లు రాజశేఖర్, నాగన్న, ఎంపిఇఒ వెంకటేశ్వర్లు , రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎఒమల్లేష్

విధులు బహిష్కరించి సమ్మెబాట

మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నిర్ణయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నాలుగు గంటల నుండి విధులు బహిష్కరించి సంపూర్ణంగా సమ్మెకు సిద్ధమైనట్లు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కర్నూలు నగర కమిటీ అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాము అనేక సందర్భాల్లో తమ సమస్యల పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టడం వల్ల ఈనెల తొమ్మిదవ తేదీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సమ్మె నోటీసులు ఇచ్చి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయం , నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీలు నిర్వహించి మా సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు రూ.21000, స్కిల్ సెమిస్కిల్ కార్మికులకు రూ.24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్ల సర్వీసు ఉన్నవారికి పర్మినెంట్ చేయాలని కోరారు. జిఒ నెంబర్ 63 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేసి పెర్మనెంట్ అయిన కార్మికులకు బెనిఫిట్స్ కింద రూ.పది లక్షలు కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, సాధారణ మరణం పొందిన కార్మికుని కుటుంబానికి రూ.5 లక్షలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.15 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. అనారోగ్యాల కారణాలవల్ల విధి నిర్వహణ చేయలేని కార్మికుని బదులుగా కుటుంబంలోని ఒక వ్యక్తికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సరెండర్ లీవ్ ప్రతిఫలాలను అమలు చేయాలని, 65 ఆదివారాలు, 17 జాతీయ పండుగలు, రెండవ శనివారాలలో కూడా పనిచేస్తున్నామన్నారు. 84 రోజులకు సెలవు దినాలుగా అయినా ప్రకటించాలన్నారు. కార్మికులకు యూనిఫాం రక్షణ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పైన పేర్కొన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎపి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పోరాడుతుందన్నారు. ఈ సమ్మెలో ప్రధాన కార్యదర్శి హెచ్. యూనిస్ బేగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రంగ ,కోశాధికారి ఇ వెంకటేశ్వర్లు,కె.జ్ఞానమ్మ దాదాపు 300 మంది కార్మికులు పాల్గొన్నారు.



పెద్ద తేనెటీగల బారిన పడి ఉపాధి కూలీలు అస్వస్థత

ప్రజాశక్తి-మద్దికేర

పెద్ద తేనెటీగల బారినపడి ఉపాధి కూలీలు అస్వస్థతకు గురైన సంఘటన మండల పరిధిలోని మదనంతపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మదనంతపురం గ్రామంలోని ఉపాధి కూలీలు ఆదెమ్మ వాగులో పనికి వెళ్లారు. ఉపాధి పనిచేసి ఇంటికి తిరిగి వస్తుండగా, వచ్చే దారిలో పెద్ద తేనెటీగలు బారినపడి ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. సంఘటన జరిగిన అనంతరం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బాధిత ఉపాధి కూలీలను టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాసులు పరామర్శించారు.



అన్నదాతకు అండగా ఉద్యమం

13న నంద్యాలలో నిరసన ప్రదర్శన

వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలబడి ఉద్యమిస్తామని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని కాటసాని రాంభూపాల్ రెడ్డి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఈనెల 13న రైతుల కోసం.. రైతులతో కలిసి నంద్యాల లోని ఉదయానంద హోటల్ దగ్గర నుంచి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. అన్నదాతను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. చంద్రబాబు కూటమి పార్టీలకు ఓట్లేయించుకుని వారిని దగాచేశారన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ అంటూ పచ్చి మోసం చేస్తుందన్నారు. ఏడాదికి రూ.20వేలు ఇస్తామంటూ సూపర్ సిక్స్ హామీ కనుమరుగయిందని, జగనన్న ఇచ్చిన రైతుభరోసాకూ ఎసరు పెట్టారని విమర్శించారు. ఖరీఫ్ ముగిసి రబీ వచ్చినా అన్నదాత సుఖీభవ పెట్టుబడి సహాయం అందక రైతులు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. బడ్జెట్లో రూ.10,700 కోట్లు పెట్టాల్సి ఉండగా దాని ప్రస్తావనే లేకపోవడం శోచనీయమన్నారు. జగనన్న హయాంలో ఏటా క్రమం తప్పకుండా డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా కింద మేనిఫెస్టోలో పెట్టింది ఏడాది రూ.12,500 కాని మరో వేయి పెంచి ఇచ్చామన్నారు. ఏడాదికి రూ.13,500 చొప్పున జగనన్న ఐదేళ్లలో 53.52లక్షల మందికి రూ.34,288 కోట్ల పెట్టుబడి సహాయం అందించారని పేర్కొన్నారు. అందుకే కూటమి ప్రభుత్వ నమ్మక ద్రోహాన్ని నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సానా శ్రీనివాసులు, నారాయణరెడ్డి , నాయకులు పందిపాడు భీమేశ్వర్ రెడ్డి, సాపూర్‌వీరయ్య, బెల్లం మహేశ్వర్ రెడ్డి, చిన్నటేకూరు ఈశ్వరయ్య, హనుమంత రెడ్డి, ఎద్దుల శివారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది వై.జయరాజు

మానవ హక్కుల పరిరక్షణ అందిరి బాధ్యత

మానవ హక్కుల దినోత్సవంలో సీనియర్ న్యాయవాది జయరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజ్యాంగం ద్వారా లభించిన మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని సీనియర్ న్యాయవాది వై.జయరాజు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం 2024 సందర్భంగా కర్నూలులో ఆర్.ప్రవీణ్, ఆర్.డేవిడ్, బి.శ్రీనివాసులు జూనియర్ న్యాయవాదులు తదితరుల ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఎపిజెఎ అండ్ ఎల్ఎస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది ,ఎపి హైకోర్టు అధ్యక్షుడు వై.జయరాజు మాట్లాడారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం 2024-ప్రస్తుత భారత దేశంలో లోని పాలకుల స్వార్థ ప్రయోజనాలతో మానవుల హక్కులు హరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది ఎలా ముఖ్యమైనదో తెలపాలన్నారు. ప్రత్యేక అతిథులుగా ఎపిబిసి సభ్యుడు పి.రవి, కర్నూలు బార్ అసోసియేషన్ నాయకులు ఎం.సుబ్బయ్య, సెక్రటరీ రవికాంత్, లాకళాశాల ప్రిన్సిపాల్ శివాజీరావు హాజరయ్యారు. న్యాయవాదులు జాన్‌బాబు, నిత్యజీవరాజు, మహేష్, అయ్యస్వామి, మానవ హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇందిరాశాంతి

ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీలో మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం అధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి మాట్లాడుతూ 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల తీర్మానం చేసిందని తెలిపారు. కుల, మత, జాతి, ప్రాంత , లింగ వివక్ష లేకుండా మనుషులందరికీ సమానంగా జీవించే హక్కు కలిగి ఉండడమే మానవ హక్కుల దినోత్సవ ప్రధాన ఉద్దేశ మన్నారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ జె. హేమంత్,రాజనీతిశాస్త్ర విభాగాధిపతి ఆర్.రోషన్న అధ్యాపకురాలు వి.నాగరత్నమ్మ డాక్టర్ డి.నాగన్న, టి.మాదన్న పాల్గొన్నారు


వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

భూవివాదం సమస్య పరిష్కారం

- ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు - ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కుంకు నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద గత కొన్నేళ్లుగా నెలకొన్న భూవివాద సమస్యను పరిష్కరించిన ట్లు పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం జిల్లేడుబుడకల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని క్రాస్ రోడ్డులోని వివాదాస్పద భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంఘాల విజ్ఞప్తి మేరకు 591 సర్వే నెంబర్‌లో 6.58 ఎకరాల వంక పోరంబోకు ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు వేశామని తెలిపారు. 597 సర్వే నెంబర్‌లోని భూమి పట్టా భూమి అన్నారు. 597 సర్వే నెంబర్‌లో 7 సెంట్ల ప్రభుత్వ భూమి తేలిందని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. 597 సర్వే నెంబర్ పూర్తిగా ప్రయివేట్ ల్యాండ్ అని, ఆ సర్వే నెంబర్‌లో దేవదాయ భూమి, ప్రభుత్వ భూమి ఉందన్నది అవాస్తవమని చెప్పారు. ఎవరూ వదంతులను నమ్మవద్దని, ఎలాంటి అనుమానం ఉన్నా రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ రికార్డులు తనిఖీ చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. 593/1, 595, 596 సర్వే నెంబర్లు అన్నీ ఆర్‌ఎస్‌ఆర్, ఆర్‌హెచ్ రికార్డుల ప్రకారం ప్రయివేట్ పట్టా భూములేనని, ఈ భూముల్లో ఎలాంటి ప్రభుత్వ భూమి లేదని చెప్పారు. డిప్యూటీ తహశీల్దార్ సుదర్శనం, మండల సర్వేయర్ మేఘశ్యామ్, విఆర్‌ఒ హరికృష్ణ పాల్గొన్నారు.

ఆందోళన తీవ్రతరం

- మున్సిపల్ ఉద్యోగుల ర్యాలీ



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంగలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన తీవ్రతరం చేశారు. మంగళవారం వాటర్ పంప్ హౌస్ నుంచి మున్సిపల్ రోడ్డు గుండా ప్రదర్శన, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఈరన్న, యూనియన్ నాయకులు రామాంజనేయులు, అహ్మద్, పీరా మాట్లాడారు. దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదేళ్ల సర్వీస్ ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆరేళ్ళుగా వేతనం పెరగక, ప్రభుత్వ పథకాలు వర్తించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఈనెల 5 నుంచి మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ వాటర్ సెక్షన్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు వివిధ దశల్లో నిరసన తెలుపుతూనే ఉన్నామని తెలిపారు. వెంటనే చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పూర్తిస్థాయిలో సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. వీరేష్, మారి, షాషావలీ, చంద్ర, రాఘవేంద్ర, కర్రెప్ప, కైలాష్, అల్తాఫ్, సోమన్న, శివ, భరత్ ఉన్నారు.

పాఠశాలలో పని చేసే నైట్ వాచ్‌మెన్‌కు

ఆరు నెలల వేతనాలివ్వండి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసే నైట్ వాచ్‌మెన్ పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరు నెలల నుంచి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని, జూన్ నుంచి నవంబర్ నెల వరకు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. దసరా, దీపావళి లాంటి ముఖ్య పండగలు ఉన్నా వేతనాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేయడం తగదని చెప్పారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టమైందని తెలిపారు. అధికారులు స్పందించి నైట్ వాచ్ మెన్ వేతనాలు మంజూరు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వాచ్‌మెన్ నారాయణ, బాషా పాల్గొన్నారు.

పని భారం...

● ఫెర్ఫామెన్స్ లేదని షోకాజు నోటీసులు

● అయోమయంలో సచివాలయం ఎఎన్‌ఎంలు


ఆదోనిలో మందులు వేస్తున్న ఎఎన్‌ఎం, సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి - ఆదోని

పని భారంతో సచివాలయ ఎఎన్‌ఎంలు మానసిక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో 50కి పైగా యాప్‌లు ఉన్నాయి. వాటిలో నిత్యం వివరాలు నమోదు చేయాల్సి ఉంది. గర్భిణీ, బాలింత, చిన్నారులు, ఎలిజిబుల్ కపుల్స్ వంటి వారి వివరాలు, వారికి అందించిన వైద్యసేవలు ఎప్పటికప్పడు యాప్‌లలో నమోదు చేస్తూనే రికార్డుల్లో పొందుపరుస్తూ దినచర్యగా ఉంటుంది. ఈ పనితో ఇబ్బందులు పడుతున్న వారికి మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలు చేయాలని సచివాలయాల్లో సాటి ఉద్యోగులు ఒత్తిడి చేస్తున్నారు.

అదనపు పని భారం

ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ పరిధిలో 5 వేల వరకు జనాభా ఉంది. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలి. టిబి, క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి ఆశావర్కర్ ద్వారా మందులు ఇప్పించాలి. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలి. బుధ, శనివారాలు యాంటినేటల్ వ్యాక్సినేషన్ చేయాలి. సేవలు పొందిన వారి వివరాలను వివిధ యాప్‌లో నమోదు చేస్తూ ఉండాలి. కర్నూలు, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో సచివాలయా లకు ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎఎన్‌ఎంలకు మినహాయింపు ఇచ్చారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో మాత్రం ఎఎన్‌ఎంలు తప్పక చేయాలని, లేదంటే సస్పెండ్ చేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో అదనపు పనులు

సచివాలయ ఎఎన్‌ఎంలు రెగ్యులర్ ఉద్యోగులు. వారికి మున్సిపాలిటీ ద్వారానే జీతాలు ఇస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నికల విధులు డ్యూటీ బిఎల్‌ఒలుగా, ఎన్‌టిఆర్ పెన్షన్ భరోసా పంపిణీ చేయడం, హౌసింగ్ జియో ట్యాగింగ్, ఇతర సర్వేలు కూడా ఎఎన్‌ఎంలకు అప్పజెబుతున్నారు. సచివాలయంలో అడ్మిన్‌తో పాటు పదిమంది ఉద్యోగులు ఉంటారు. వారి పనులు.. మున్సిపాలిటీ పరిధిలో జరిగే కార్యకలాపాలు మాత్రమే చూడాల్సి ఉంటుంది. వారితోపాటు ఎఎన్‌ఎంలను కూడా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నారు. కోరినా వినేవారు లేరని ఎఎన్‌ఎంలు వాపోతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులు సక్రమంగా చేయలేక పనిష్‌మెంట్లకు గురవుతున్నామని వాపోతున్నారు.

ఎఎన్‌ఎంలకు షోకాజు నోటీసులు

సచివాలయం పరిధిలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యక్రమాలు నిర్వహించడంలో వెనకబడ్డారన్న కారణంగా ఆదోనిలో పదిమందికి పైగా ఎఎన్‌ఎంలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. తాము ఏం పని చేయాలో అధికారులు గ్రహించడం లేదని, అదనపు భారం తగ్గించాలని పలుమార్లు కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఎఎన్‌ఎంలు వాపోతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమంటూ నిలదీస్తున్నారు. ఇదే విషయాన్ని ఆదోని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి దృష్టికి తీసుకెళ్లగా... గర్భిణులను గుర్తించడంలో వెనకబడ్డారన్న కారణంగా మెడికల్ ఆఫీసర్లకు షోకాజు నోటీసులు ఇచ్చారని, వారితో పాటు ఎఎన్‌ఎంలు కూడా ఇచ్చి ఉండవచ్చని చెప్పారు. అదనపు పని భారం ఉందని ఎఎన్‌ఎంలు చెబుతున్నా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పట్టించుకోకుండా తమ పట్ల చులకన భావన ప్రదర్శిస్తున్నారని ఎఎన్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బీవీ సహకారంతో

20 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- సెంట్రల్ లైటింగ్ ద్వారా సుందరంగా పట్టణం
- టిడిపి పట్టణ నాయకులు బందే నవాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత 20 ఏళ్ల నుంచి వేధిస్తున్న గూడూరు బైపాస్ రోడ్డు, డ్రయినేజీ సమస్యను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పరిష్కరించినట్లు టిడిపి పట్టణ నాయకులు బందేనవాజ్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గూడూరు బైపాస్ రోడ్డులో జరుగుతున్న డ్రయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రతి వార్డులోనూ ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. శివారు కాలనీల్లో రోడ్లు, డ్రయినేజీలు, వీధి దీపాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలో సుందరంగా తీర్చిదిద్దేందుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు బైపాస్ రోడ్డు, రహదారి నిర్మాణాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాన రహదారుల నిర్మాణ పనులు చేపట్టిందని చెప్పారు. అభివద్ధి పనులకు పట్టణ ప్రజలు సహకరించడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం కర్నూలు బైపాస్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే సెంట్రల్ లైటింగ్ ప్రజలకు అందుబాటులో వస్తుందన్నారు.

నాణ్యత డొల్ల..!

- డ్రెయినేజీ నిర్మించిన వారంలోపే పగుళ్లు

ప్రజాశక్తి - ఆస్పరి

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి నిధులు రూ.5 లక్షలతో చేపడుతున్న పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. పది కాలాలపాటు ఉండాల్సిన పనులు నాణ్యత లేకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. అధికారుల చేతివాటం కారణంగానే పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆస్పరి మండలం హాలిగేర గ్రామంలో రూ.5 లక్షలతో చెరువుకు వెళ్లే రహదారిలో సిసి రోడ్డు, డ్రెయినేజీ పనులు జరుగుతున్నాయి. డ్రెయినేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మాణం పూర్తయిన వారంలోపే పగుళ్లు ఏర్పడ్డాయి. సిసి రోడ్డు నాణ్యతగా, దృఢంగా ఉండాలంటే వైబ్రేషన్ మిషన్ ఉపయోగించాలి. వైబ్రేషన్ మిషన్ లేకుండా రోడ్లు వేస్తున్నారంటే అధికారులు ఏ స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారో అర్థమవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి సిసి రోడ్డు, డ్రెయినేజీ కాలువ పనుల నిర్మాణంలో నాణ్యత పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


పగుళ్లు ఇచ్చిన డ్రెయినేజీ



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి భీమయ్య

సమస్యల పరిష్కారానికి అదాలత్

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే అదాలత్ ముఖ్య ఉద్దేశమని ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి తెలిపారు. మంగళవారం రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వారి కార్యాలయం వద్ద సమస్యల పరిష్కార వేదిక ద్వారా అదాలత్‌ను నిర్వహించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించిన ఈ వేదిక ద్వారా విద్యుత్ సమస్యలపై రాతపూర్వకంగా వినతులు స్వీకరించారు. స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని 33 కెవి లైన్ నివాస ప్రాంతాల్లో ఉందని, వేరే చోటికి మార్చాలని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య వినతిపత్రం అందజేశారు. ఛైర్మన్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇవ్వకముందే విద్యుత్ లైన్ వేశారని, దాన్ని మార్చడానికి చలానా కట్టి చేయించుకోవాలని సూచించారు. చిలకలడోణ గ్రామంలో 11 కెవి లైన్ వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మార్చాలని సిపిఎం మండల కార్యదర్శి జయరాజు కోరారు. పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన బలిజ వీరేష్ విద్యుత్ హెల్పర్‌గా పని చేస్తూ విద్యుత్ స్తంభంపై నుంచి పడి మృతి చెందారని, ఇంత వరకు నష్టపరిహారం లేదని, కనీసం భర్త ఉద్యోగం తనకు ఇవ్వలేదని వీరేష్ భార్య సువర్ణ ఫిర్యాదు చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరిస్తామని, తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఛైర్మన్ తెలిపారు. ఈఈ విజయరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విశ్వ శాంతి స్వరూప్, ఏఈ గోవిందు పాల్గొన్నారు.

అజెండా రిజిస్టర్, పంచాయతీ అటెండెన్స్ రిజిస్టర్ ఇప్పించాలి

- ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా లీగల్ సెల్ అడ్వయిజర్ విజయ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన పంచాయతీ అంజెండా రిజిస్టర్లు ఇప్పించాలని ఫోరం ఫర్ ఆర్‌టిఐ జిల్లా లీగల్ సెల్ అడ్వయిజర్ విజయ కుమార్ కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో జులైలో పంచాయతీ అభివృద్ధి పనుల గురించి సమాచారంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి మహేష్ సమాచారం అసంపూర్తిగా ఇచ్చినట్లు తెలిపారు. స్పందించిన ఎంపిడిఒ విజయకుమార్ కోరిన సమాచారాన్ని త్వరలోనే పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇప్పించాలని ఇఒఆర్‌డి ప్రభావతిని ఆదేశించారు.


వినతిపత్రం అందజేస్తున్న విజయకుమార్


పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

అంతరాయం లేకుండా నీటి సరఫరా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయమూ లేకుండా అందించాలని కమిషనర్ ఎన్.గంగిరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలో తాగునీటి వనరులను కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని ఫిల్టర్ బెడ్, పంపు హౌస్, మారెమ్మ కొండ వాటర్ ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు పరిశీలించారు. అలాగే పట్టణంలోని కర్నూలు బైపాస్ రోడ్డు, గోనెగండ్ల సర్కిల్ దగ్గర డ్రెయిన్ నిర్మాణ పనులను, బైపాస్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పనులు పరిశీలించారు.

వేదవతికి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి

ప్రజాశక్తి - ఆలూరు

అర్ధాంతరంగా నిలిచిపోయిన వేదవతి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి కోరారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మద్దిలేటి శెట్టి, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు భూపేష్ మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి 2024-25 బడ్జెట్‌లో నిధులు కేటాయించి 8 టిఎంసిలతో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. తాగు, సాగునీటి కోసం 8 టిఎంసిలతో హాలహర్వి మండలం బిల్లేహాల్, ఆలూరు మండలం మొలగవల్లి దగ్గర రిజర్వాయర్ నిర్మాణంలో ఉండగా గత ప్రభుత్వం నిధులను మళ్లించడంతో మధ్యలో ఆగిపోయిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని కోరారు. రైతు సంఘం తాలూకా అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు, గోపాల్, రంగన్న, సిద్దేశ్వర కాలనీ శాఖ సమితి కార్యదర్శి సిద్దప్ప, పెద్దహోతూరు రాముడు, వన్నూరు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికే...

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

● గ్రామ రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కౌతాళం

రైతులు ఎదుర్కొంటున్న భూ వివాదాల పరిష్కారానికే గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని హాల్వి గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాటి పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సభలకు శ్రీకారం చుట్టిందన్నారు. పొలాల హద్దులు, ఆన్‌లైన్‌లో తప్పులు, రెవెన్యూ రికార్డుల్లో భూ తేడాలను రైతులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే గ్రామసభల దృష్టికి తీసుకురావాలని కోరారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్, టిడిపి నాయకులు చిన్న సిద్ధయ్య, సోమనాథ్, దర్గమూలా, సిద్ధన గౌడ్, శివ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం నేమకల్లు గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి వన్నూరు స్వామి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి విజయ్ కుమార్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ మాట్లాడారు. ఆర్‌ఐ సునీత, మండల సర్వేయర్ నారాయణ, విఆర్‌ఒలు మల్లికార్జున, అంజి, చంద్ర నాయక్, సచివాలయ సర్వేయర్లు వినోద్ కుమార్, రామ్ నాయక్ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం ములుగుందం గ్రామంలో విఆర్‌ఒ సుప్రియ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సు నిర్వహించినప్పుడు అర్జీ రూపంలో అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూ సమస్యలపై 11 అర్జీలు వచ్చాయన్నారు. ఆర్‌ఐ రంగస్వామి, మండల సర్వేయర్ శ్రీనివాసులు, జిల్లా ఎండోమెంట్ అధికారి శ్రీనివాసులు, విఆర్‌ఒలు గోవిందరాజులు, అల్లా బకాష్, పంచాయతీ సెక్రటరీ జంప్లా నాయక్, గ్రామ పెద్దలు మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలం గంజిహళ్లి గ్రామంలో తహశీల్దార్ కుమారస్వామి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ రకాల సమస్యలపై రైతుల నుంచి 46 వినతులు అందాయి. తహశీల్దార్ మాట్లాడుతూ... దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ సభలో వచ్చిన అర్జీలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన సమయంలోపు పరిష్కరిస్తామన్నారు. **హొళగుంద** మండలం ఎల్లార్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ... గ్రామంలో 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్‌ఒ ప్రహ్లాద పాల్గొన్నారు. **ఆలూరు** మండలం మొలగవల్లి గ్రామంలో తహశీల్దార్ గోవింద్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మ్యూటేషన్, డిజిటల్ కీ, సర్వే నెంబరు ఆన్ లైన్‌లో లేకపోవడం వంటి సమస్యలను రైతులు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో మొత్తం 21 అర్జీలు వచ్చాయి. రైతులకు ఇచ్చిన సమయంలోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్‌ఐ బసన్న గౌడ్, సర్పంచి మోహన్ రాజు, మండల సర్వేయర్ అరుణ జ్యోతి, విఆర్‌ఒలు రామాంజినేయులు, గాదిలింగ పాల్గొన్నారు.


కౌతాళంలో వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


నేమకల్లు (చిప్పగిరి)లో


ఆలూరులో...

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు సురేష్ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూల విరాట్‌కు నెయ్యి, పంచామృతాభిషేకం నిర్వహించి, స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేశారు. హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు రమేష్, సిద్ధు, బండి శివ కుమార్, మరిలింగ, గర్జప్ప, శంకరప్ప, నెరనికి, బండి లోకేష్ కుమార్, యశ్వంత్, సోము, వీరేష్, ఆదిశేషిరెడ్డి, పంచరబెల్ల గర్జప్ప, పంపన్న, మానప్ప, కృష్ణ, తిమ్మప్ప పాల్గొన్నారు.


స్వామివారిని ఊరేగిస్తున్న ప్రజలు

రహస్య ఓటింగ్‌తో ఎన్నికలు : ఎంపిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 14న జరిగే సాగునీటి సంఘం ఎన్నికలను రహస్య ఓటింగ్ ద్వారా జరిపేటట్లు చూడాలని ఎంపిపి జూటూరు హేమలత, వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య కలెక్టర్‌ను, సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం వారు మాట్లాడారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయని, వాటిని పరిగణనలోకి తీసుకొని రహస్య ఓటింగ్ పద్ధతి ద్వారా జరగాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఓటర్లను భయభ్రాం తులకు గురిచేసే అవకాశం ఉన్నందున, అధికారులు రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరపాలని తెలిపారు. లాల్ స్వామి, లింగన్న, ఓలయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత, మారయ్య

చోరీకి పాల్పడిన దొంగ - పట్టించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోనే మంగళవారం చోరీ జరిగింది. పసిగట్టిన స్థానికులు దొంగను పోలీసులకు పట్టించారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... గ్రామంలోని కురువ పేటలోని బీరప్ప దేవాలయం సమీపంలో తోక గిడ్డయ్య కుటుంబం నివాసం ఉంటున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి పని మీద బయటకు వెళ్లారు. తాళం వేసిన ఇంటిని పసిగట్టిన దొంగ తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న నగదు బంగారం దొంగిలించాడు. శబ్దాలు రావడంతో పసిగట్టిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం పసిగట్టిన దొంగ చోరీ సొమ్ముతో కూడిన సంచిని ముళ్లపొదల్లోకి విసిరేసి సమీపంలోనే అనుమానం రాకుండా కూర్చున్నాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి స్థానికుల సమాచారం మేరకు అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారించి చోరీ సంచిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి దేవనకొండ మండల వాసిగా గుర్తించారు.

విధుల్లో పారదర్శకత ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - చిప్పగిరి


కృష్ణ సాగర్‌ను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది, పాత్రికేయులు

ఎక్కడ విధులు నిర్వర్తించామన్నది ముఖ్యం కాదని, విధుల్లో ఎంత పారదర్శకంగా ఉన్నామని, సమాజానికి న్యాయం చేస్తున్నామా.. లేదా అన్నది ముఖ్యమని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ నుంచి కర్నూలు త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న కృష్ణ సాగర్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే పాత్రికేయులు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ప్రతి ఉద్యోగికీ బదిలీ సర్వసాధారణమన్నారు. తమకు సిబ్బంది లేని నేపథ్యంలో కూడా కృష్ణ సాగర్ విధుల్లో మంచి పనితనం కనబరిచారని తెలిపారు. ఆయన వెళ్తున్నందుకు తమకు, తమ సిబ్బందికి వెలితి కనబడుతుందన్నారు. ఆయన ఎక్కడ విధులు నిర్వర్తించినా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. హెడ్ కానిస్టేబుల్ ఖాదర్ వలీ, సుబ్రమణ్యం, పోలీసులు షబ్బీర్ బాష, భాస్కర్, తిమ్మప్ప, రామోజీ, మద్దిలేటి, పాత్రికేయులు రవి, గోవిందు, యూసుఫ్ పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీని కలిసిన మాబుసాబ్

ప్రజాశక్తి - కౌతాళం



జిల్లా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరాను కౌతాళం కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. దూదేకుల సంఘం తరపున అభినందనలు తెలిపామని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలకు తమ కుటుంబం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు భరోసా ఇచ్చారు. మంగళవారం నియోజకవర్గంలోని ఆరెకల్ గ్రామంలో నాయకులు రామకృష్ణ అధ్యక్షతన టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా, లేకున్నా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పార్టీ కార్యక్రమాలను అందరి సహకారంతో విజయవంతం చేసినట్లు తెలిపారు. నియోజవర్గంలో టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి సభ్యత్వం ముమ్మరం చేస్తామని తెలిపారు. రంగస్వామి నాయుడు, రంగన్న, రామస్వామి, బసవరాజు, అయ్యన్న, అంజి, కృష్ణారెడ్డి, జయరాం, నాగరాజ్, గిడ్డయ్య, శేషి రెడ్డి, శంకర్ రెడ్డి, భీమా, బాబు నాయుడు, శ్రీనివాస చౌదరి, సయ్యద్ బాషా, మదిరే వీరేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు